క్లుప్తంగా

జగనన్న కాలనీలకు శంకుస్థాపన



గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

అనుమసముద్రంపేట: మండలంలోని శ్రీకొలను జగనన్న కాలనీలో శనివారం ఎంపీపీ బి పద్మజారెడ్డి సర్పంచ్ ఆదిలక్ష్మమ్మ, ఎంపీటీసీ జయమ్మతో కలిసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ డిసెంబర్‌లోపు నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ రమేష్‌ను కోరామన్నారు. నాణ్యత లోపించకుండా నిర్మాణాలు చేయాలని ఆమె కోరారు. లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

• ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతం చేసుకోవచ్చని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నా రు. కావలి జెడ్పీ క్రీడా మైదానంలో 42వ అంతర్ జిల్లా షూటింగ్ బాల్ పోటీలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు గెలుపోటములను పరిగణలోకి తీసుకోకుండా క్రమం తప్పకుండా క్రీడా సాధన చేయాలని సూచించారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, శారీరక, మానసిక దారుఢ్యాలు పెంపొందుతా యని వివరించారు. కార్యక్రమంలో క్రీడా పోటీల నిర్వాహకులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

జలదంకి: మండలంలోని అన్నవరం సచివాలయంలో శనివారం నూతనంగా మంజూరైన పింఛన్లను ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి పంపిణీ చేశారు. మాలకొండారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నవరం సర్పంచ్ గుమ్మడి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు



పొంగూరులో పోలేరమ్మగుడి వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం పొంగూరులో శనివారం మహిళలు పోలేరమ్మకు పొంగళ్లు పెట్టారు. మూడు రోజులుగా నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి ప్రతిష్టా కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మేళతాళాలతో మహిళలు అమ్మవారి ఆలయానికి చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆదివారం అమ్మవారికి బలిదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఉర్లగంటి శ్రీనివాసులరెడ్డి, పార్లపల్లి కొండారెడ్డి, పెంచలరెడ్డి తదితరులు తెలిపారు.

శ్రీకృష్ణుడికి పల్లకి ఉత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌లో ప్రబోధ సేవాసమితి, ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాల నడుమ, భజన కీర్తనలకు నృత్యాలు చేస్తూ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. విద్యార్థులకు నిర్వ హించిన భగవద్గీత శ్లోకాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఎమ్మెల్యే సత్కారం



చేజర్ల(సోమశిల): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్న అనంతసాగరం మండలానికి చెందిన తిరుపతిరెడ్డిని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సన్మానించారు. శనివారం ఆయన నివాసంలో సన్మానించారు. అనంతసాగరంలోని హిందూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

తమ్ముళ్లలో సానుభూతి కరువు

- బాబు అరెస్ట్‌పై ఉదయగిరిలో కనిపించని స్పందన
- ముఖ్య నేతలందరూ ముఖం చాటేత
- నామమాత్రంగా నేతలు నిరసన చేసే ప్రయత్నం
- బాబు తప్పు చేశాడన్న భావన ప్రస్ఫుటం



కలిగిరిలో కొద్దిమంది అనుచరులతో బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న చెంచలబాబు



వరికుంటపాడులోని బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న టీడీపీ నేతలు

ఉదయగిరి: టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలతో సీఐడీ శనివారం ఉదయం అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఆ పార్టీ కేడర్, సానుభూతిపరుల నుంచి ఉదయగిరి నియోజకవర్గంలో స్పందన నామమాత్రంగా ఉంది. అరెస్ట్ నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు ముందస్తుగా ప్రధాన కూడళ్లలో బందోబస్తును ఏర్పాటు చేశారు. అయితే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం ముఖం చాటేశారు. టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో కొందరు నేతలు రోడ్లపైకి ప్రజారవాణాకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేయడంతో ఎక్కడికక్కడే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఉదయగిరి టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని రామారావు సొంత మండలం కలిగిరిలో స్థానిక నేతలు ఎవరూ నిరసన తెలిపేందుకు బయటకు రాకలేదు. నెల్లూరులో నివాసముంటున్న మాజీ జెడ్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్ హుటాహుటిన పదిహేను మంది వ్యక్తులతో కలిగిరి చేరుకుని కలిగిరి బస్టాండ్‌లో నిరసన తెలిపారు. ప్రజల నుంచి స్పందన కరువవడంతో కొద్ది సేపు నినాదాలు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బొల్లినేని రామారావు నిరసనలో పాల్గొనలేదు. వింజమూరులో టీడీపీ నేతల నుంచి దాదాపు స్పందన లేనట్లుగానే చెప్పవచ్చు. పార్టీ మండల కన్వీనరు రఘురామిరెడ్డి కొద్ది మంది అనుచరులతో పోలీస్‌స్టేషన్ సమీపంలో నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దుత్తలూరులోని జాతీయ రహదారిపై వేళ్లమీద లెక్కపెట్టేంత మంది టీడీపీ శ్రేణులు రాకపోకలకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేయగా సీఐ గిరిబాబు వారిని అదుపులోకి తీసుకున్నారు. దుత్తలూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి సైతం నిరసన కార్యక్రమాన్ని చేపట్టలేదు. వరికుంటపాడు బస్టాండు వద్ద కొద్ది మంది టీడీపీ నేతలు రాస్తారోకో చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయగిరిలో అయితే ఆ పార్టీ నుంచి దాదాపు స్పందన కరువైంది. ఐదారుగురు వ్యక్తులు పంచాయతీ బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా ఎస్సై ఇంద్రసేనారెడ్డి వారిని అదుపులోకి తీసుకున్నారు. సీతారామపురం మండలంలో టీడీపీ నుంచి స్పందన కనిపించలేదు. జలదంకిలో కొద్ది మంది టీడీపీ నేతలు బలవంతంగా దుకాణాలు మూయించే ప్రయత్నం చేశారు. దీంతో దుకాణాల యజమానులు వారిని ప్రతిఘటించారు. పార్టీ ఆదేశాల మేరకు తాము ఈ కార్యక్రమం చేపట్టామని, దయచేసి సహకరించి తమ పరువు కాపాడాలని టీడీపీ నేతలు దుకాణ యజమానులను వేడుకున్నారు. దీంతో కొంతమంది కొద్దిసేపు దుకాణాలు మూసి తమ వ్యాపారాలు కొనసాగించారు. స్కిల్ కుంభకోణంలో చంద్రబాబు పాత్రపై సీఐడీకి పూర్తి ఆధారాలు లభించడంతో బాబును అరెస్ట్ చేశారన్న విషయం అటు ఆ పార్టీ నేతలు, ఆ పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు వాస్తవాలని భావించడంతో బాబును అరెస్ట్ చేసినా పెద్దగా స్పందించలేదు. సీఐడీ అధికారులు రెండేళ్ల పాటు సుదీర్ఘంగా విచారణ జరిపి పూర్తి ఆధారాలు సేకరించి బాబును అరెస్ట్ చేసిన విషయం సామాన్య ప్రజలకు సైతం అవగతమైంది. బాబుకు ముడుపులు అందించిన ముఖ్య నేతలను దేశం నుంచి బయటకు పంపడంలో కీలకంగా వ్యవహరించిన చంద్రబాబు తనకు అరెస్ట్ తప్పదని రెండు రోజుల క్రితమే ప్రకటించడం తాను చేసిన అనేక తప్పుల నుంచి బయటపడలేనప్పటికీ ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకోలేకపోయారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారన్న విషయం వాస్తవమని జనాలకు తెలియడంతో సామాన్య ప్రజల నుంచి సానుభూతి కరువైంది. కార్యకర్తలు, నేతలను రోడ్లపైకి వచ్చి అల్లర్లు సృష్టించాలని ఆ పార్టీ పైస్థాయి నేతలు సంకేతాలు ఇచ్చినప్పటికీ ఆశించిన రీతిలో ఆదరణ కనిపించలేదు.

ఆధారాలతోనే అరెస్ట్



స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాతే సీఐడీ అధికారులు ప్రతిపక్ష నేత చంద్రబాబును అరెస్ట్ చేశారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబుతో పాటు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఖజానాను దోచేసి రాష్ట్రానికి తీవ్ర నష్టం కలిగించారు. చేసిన తప్పులకు ఎప్పటికైనా మూల్యం చెల్లించుకోక తప్పదని చంద్రబాబు అరెస్ట్‌తో రుజువు అయ్యింది.

– పాలూరు మాల్యాద్రిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, కలిగిరి

బాబుకు శిక్ష తథ్యం



ఎన్నో కేసుల్లో కోర్టులకెళ్లి స్టేలు తెచ్చుకుంటున్న ప్రతిపక్షనేత చంద్రబాబుకు శిక్ష పడడం తథ్యం. ఇన్ని రోజులు వ్యవస్థలను అడ్డదారుల్లో మేనేజ్ చేస్తున్న వస్తున్న చంద్రబాబు అరెస్ట్‌ను టీడీపీ నాయకులు సైతం తప్పుడు చేశాడు కాబట్టే అరెస్ట్ అయ్యాడంటున్నారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్న చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ ఆశలు నేరవేరవు.

– కాటం రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, కలిగిరి

టీడీపీ నేతల్లో కనిపించని స్పందన



ఆత్మకూరులో టీడీపీ శ్రేణుల రాస్తారోకో



అనంతసాగరంలో ఇంటి ముందు నిరసన



మర్రిపాడులో నేతలను తరలిస్తున్న పోలీసులు

సంగం: టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికి అరెస్ట్ అయిన నేపథ్యంలో మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో స్పందన కరువైంది. ఆ పార్టీ నాయకులు కొందరు ఒక అరగంట పాటు రోడ్డుపై బైఠాయించి నిరసన మమ అనిపించి ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సీఐడీ అధికారులు అన్ని ఆధారాలతో చంద్రబాబు అరెస్ట్ చేశారన్న నిజాలు తెలియడంతో ఏదో చేయాలనే ఉద్దేశంతో కాసేపు నినాదాలు చేసి వెళ్లిపోవడం కనిపించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా పోలీసులు గట్టి చర్యలు తీసుకున్నారు.

ఇళ్లల్లోనే టీడీపీ నేతల నిరసన

చేజర్ల (సోమశిల): చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనకు టీడీపీ, నాయకులు, కార్యకర్తల నుంచి స్పందన రాకపోవడంతో అనంతసాగరంలో శనివారం నేతలు తమ ఇళ్లల్లో నిరసన చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రవీంద్రరెడ్డి ఇంటి వద్దనే నిరసన చేపట్టారు. పోలీసులు నిరసన చేస్తున్న రవీంద్రరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. చంద్రబాబు తప్పు చేశాడనే భావనతో అటు పార్టీ క్యాడర్ నుంచే కాకుండా ప్రజల నుంచి స్పందన కరువైంది.

• చంద్రబాబు అరెస్ట్‌కు ఖండిస్తూ చేజర్లలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరూ బయటకు రాలేదు. ఏదో చేయాలి కాబట్టి అన్నట్లుగా పలువురు నాయకులు ఉనికి కోసం తమ ఇళ్లలోనే నిరసన చేపట్టి విలేకరుల సమావేశాలు పెట్టి మమ అనిపించారు. ఇంట్లో నిరసన చేస్తున్న వారిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

టీడీపీ నాయకుల అరెస్ట్

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): టీడీపీ అధినేత చంద్రబాబును సీఐడీ అధికారులు అక్రమాల కేసులో అరెస్ట్ చేసిన నేపథ్యంలో మర్రిపాడులో టీడీపీ నాయకులు శనివారం 67వ నంబరు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. వెంటనే మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని టీడీపీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి అరెస్ట్ చేశారు. టీడీపీ నాయకులు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, గాలిబోయిన లక్ష్మీనరసయ్య, ఎలగాల వెంకటేశ్వర్లు, కృష్ణపాటి మధుసూదన్‌రెడ్డి తదితరలను పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఉన్నారు.

టీడీపీ నిరసనతో నిలిచిన ట్రాఫిక్

ఆత్మకూరు: చంద్రబాబునాయుడు అరెస్ట్‌పై ఆత్మకూరులో టీడీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 8.30 గంటల సమయంలో నెల్లూరుపాళెం వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సీఐ జీ వేణు ఆధ్వర్యంలో ఎస్సైలు ఎం ముత్యాల రావు, సాయిప్రసాద్ పోలీసు సిబ్బంది టీడీపీ నాయకులను స్టేషన్‌కు తరలించారు.

ప్రజల సొమ్మును దోచుకున్నారు



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ప్రభుత్వ డబ్బు అంటే ప్రజల సొమ్ము రూ.371 కోట్లు అవినీతి జరిగింది. అప్పటి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జీఓలో ఒకటి ప్రజల్లోకి చూపించి ఒప్పందం మరోలా చేసుకుని షెల్ కంపెనీల ద్వారా ప్రజల సొమ్మును సొంత ఖాతాల్లోకి మార్చుకున్నారు. సీఐడీ అధికారులు పూర్తిగా విచారించి చర్యలు తీసుకున్నారు.

– మెట్టుకూరు వాసుదేవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత

అవినీతి ఎప్పటికైనా బయటపడుతుంది



ప్రజలకు మంచి చేస్తారనే ఉద్దేశంతో పాలకులను గద్దెనెక్కిస్తే వారు అవినీతికి పాల్పడి ప్రజల సొమ్మును అడ్డంగా తినేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన అవినీతి ఇప్పుడిప్పుడే బయటకు వస్తోంది. షెల్ కంపెనీల ద్వారా ప్రజల సొమ్మును వివిధ ఖాతాల్లో తెచ్చి సొంత ఖాతాలకు మళ్లించుకున్నారు. ఇలాంటివి మరెన్నో బయట పడుతాయి.

– కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, సంగం

చట్టం తన పని తాను చేస్తోంది



ఆత్మకూరు: చట్టం ఎవరి విషయంలోనైనా తనపని తాను చేస్తుందని మరోసారి రుజువైంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబును సీఐడీ అధికారులు చట్ట ప్రకారమే అరెస్ట్ చేశారు. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. తప్పు చేసిన చంద్రబాబు తనను అరెస్ట్ చేస్తారని మూడు రోజుల క్రితమే ఆయనకు ముందే తెలుసు.

– అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు

వింజేటమ్మగుడి రహదారి పనులు ప్రారంభం



రహదారి అభివృద్ధికి జేసీబీతో పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు గ్రామదేవత వింజేటమ్మ గుడికి వెళ్లే రహదారి అభివృద్ధి పనులను శనివారం ఆంధ్రప్రదేశ్ సాధికారిక సంస్థ కో ఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్‌రెడ్డి దేవాలయ ట్రస్ట్ సభ్యులతో కలిసి రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ పనులకు సంబంధించిన పూర్తి ఆర్థిక సహకారం ప్రభాకర్‌రెడ్డి అందజేస్తున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వింజేటమ్మగుడి ప్రాంతాన్ని ఏపీ టూరిజంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాబడతామన్నారు. ఇప్పటికే రూ.2.35 కోట్ల నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఈ గుడిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే పర్యాటకంగా మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో పాటు సీఆర్‌ఎఫ్ నిధులతో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఆయనతో పాటు ఆలయ ట్రస్ట్ సభ్యులు పల్లాల కొండారెడ్డి, దాదిబత్తిన కొండారెడ్డి, పలకల కొండారెడ్డి, జి.చంద్ర, గవిరెడ్డి రామలింగారెడ్డి, తదితరులున్నారు.

ఎంపీడీఓగా ఈశ్వరమ్మ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి: మండల రెగ్యులర్ ఎంపీడీఓగా డి.ఈశ్వరమ్మ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం ఏఓ (అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్)గా పని చేస్తూ పదోన్నతిపై ఉదయగిరి ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం కల్పిస్తానన్నారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసిన ఎస్.మల్లికార్జున ఇకపై ఈఓపీఆర్డీగా కొనసాగుతారు.

సదరన్ చానల్‌లో వృద్ధురాలి మృతదేహం

సంగం: బుచ్చిరెడ్డిపాళెం నుంచి అన్నారెడ్డిపాళెం వెళ్లే కనిగిరి రిజర్వాయర్ సదరన్ చానల్‌లో శనివారం ఓ గుర్తుతెలియని (65) వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అరవపాళెం సమీపంలో సదరన్ చానల్‌లో గుర్తించిన వృద్ధురాలి మృతదేహాన్ని ఎస్సై నాగార్జునరెడ్డి వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి మేకపాటి పరామర్శ

ఉదయగిరి: మండలంలోని జి.చెరువుపల్లి పంచాయతీ సంజీవరాజుపల్లి గ్రామానికి చెందిన బడబాగ్ని తిరుపాల్‌రాజు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. శనివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట గానుగపెంట ఓబుల్‌రెడ్డి, సంజీవరాజు, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

విషపూరిత మేత తిని 14 గొర్రెలు మృతి

చేజర్ల: విషపూరిత మేత తిని 14 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని ఓబులాయపల్లిలో శనివారం జరిగింది. నాగులూరు చిన్నకు చెందిన మూడు గొర్రెలు, నారాయణమ్మకు చెందిన 11 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెలు గడ్డి మందు కొట్టి ఉన్న పొలంలో మేతకు వెళ్లి పచ్చిక తినడంతో మృతి చెందాయని బాధితులు చెబుతున్నారు. గొర్రెలే జీవనాధారం కావడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రేణులు మౌనం.. నిరసనలకు దూరం

- అధినేత అరెస్ట్‌పై స్పందించని కార్యకర్తలు, నాయకులు
- ఐటీడీపీ పదేపదే పిలుపుఇచ్చినా ముఖం చాటేసిన సీనియర్లు



కావలి: నిరసనలో పట్టుమని పాతిక మంది కూడా లేని టీడీపీ శ్రేణులు

కావలి: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌పై ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల నుంచి కనీస స్పందన కరువైంది. నిత్యం నీతులు చెప్పే తమ నేత స్కిల్ స్కాంలో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోవడంతో కనీసం నిరసనలు తెలిపేందుకు కూడా ముందుకు రాకుండా మౌనం దాల్చారు. సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలను రెచ్చగొడుతూ నిరసన ప్రదర్శనలు చేయాలని ఐటీడీపీ విభాగం పదేపదే పిలుపునిచ్చినా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించి ప్రజల దృష్టిని తమ వైపు తిప్పుకోవాలని పరోక్షంగా రెచ్చగొట్టినా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టించుకోలేదు. ఇప్పటికే వాస్తవాలు గ్రహించిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు టీడీపీకి, చంద్రబాబుకు ఒక దండం అంటూ నిర్ద్వందంగా నిరసన కార్యక్రమాలను తిరస్కరించారు. కార్యకర్తలు, పార్టీ అభిమానుల నుంచి స్పందన లేకపోవడంతో నియోజకవర్గ ఇన్‌చార్జి కూడా హౌస్ అరెస్ట్ పేరుతో తెలివిగా గడపదాటలేదు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా చెప్పుకుని తిరుగుతున్న మాలెపాటి సుబ్బానాయుడు హౌస్ అరెస్ట్ అని చెప్పి నెల్లూరులోనే ఆగిపోయాడు. కావలి టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన బిల్డర్ పసుపులేటి సుధాకర్ చంద్రబాబు అరెస్ట్ అన్యాయం అంటూ వీడియో విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. బీద రవిచంద్ర సోదరుడు బీద గిరిధర్ 20 మంది అనుచరులతో అల్లూరులో హడావుడి చేయాలని చూసినా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించడంతో అంతా సర్దుకుని వెళ్లిపోయారు. దగదర్తిలో పది మంది నిరసన చేయాలని విఫలయత్నం చేసి ప్రజల నుంచి, కార్యకర్తల నుంచి స్పందన లేకపోవడంతో స్వచ్ఛందంగా పోలీసులకు సమాచారం ఇచ్చి మరీ ఫొటోలు దిగి కార్యక్రమం మమ అనిపించారు. కావలిలోని ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో పది మంది కార్యకర్తలు ఐదు నిమిషాల హడావుడికే పరిమితమయ్యారు. టీడీపీ మహానాడుకు, లోకేష్ పాదయాత్రకు భారీగా విరాళం ఇచ్చి కావలి టికెట్ నాదే అని ప్రచారం చేసుకున్న మరో కాంట్రాక్టర్ చంద్రబాబు అరెస్ట్‌పై పెదవి విప్పేందుకు కూడా ఇష్టపడలేదు. కార్యకర్తలను రెచ్చగొట్టి అల్లర్లు చేయాలని టీడీపీ సోషల్ మీడియా విభాగం ఎంతగా రెచ్చగొట్టినా కార్యకర్తలు రెచ్చిపోకుండా చంద్రబాబు అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా చూసిన కార్యకర్తల్లో ఆగ్రహం బదులుగా నమ్మి మోసపోయామనే బాధే కనిపించింది.

బాబు అడ్డుకున్నా ఆగని సంక్షేమం

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో పేద ప్రజలకు పథకాలు అందకుండా చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతంగా తిప్పికొట్టి పేదల పక్షపాతిగా నిలిచారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 39వ వార్డులో ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికెళ్లి గడిచిన నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఆయా పథకాల ద్వారా పేదలకు అందిన ప్రయోజనాలను వివరించారు. పథకాల అమల్లో పారదర్శకతను వివరిస్తూ ప్రభుత్వం ముద్రించిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాలనలో నూతన శకానికి నాందీ పలికారన్నారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచి పరిపాలనకు సరికొత్త నిర్వచనం పలికారని వివరించారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యానికి బాటలు వేశారని తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ముంగిటకే తీసుకువెళ్లారన్నారు. పేదల సంక్షేమంతో పాటు విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించడానికి వీలుగా సెప్టెంబర్ 15 నుంచి విలేజ్ క్లినిక్‌ల సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు, వలంటీర్లతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగంలో నూతనంగా నిర్మిస్తున్న 17 మెడికల్ కళాశాలల నిర్మాణాల్లో కూడా పురోగతి వేగంగా ఉందన్నారు. పేదరికం వల్ల ఏ ఒక్కరూ ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న లక్ష్యంతో మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు పేదవాడి సొంతమైతేనే పేదరికం నిర్మూలన సాధ్యమని ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. పేదలకు ఇంటి స్థలాలు, పక్కాగృహాలు ఇస్తుంటే, కోర్టులు ద్వారా చంద్రబాబు అడ్డుపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, వీఎంఆర్ మాలి, ఇంతియాజ్, భాస్కర్, శేఖర్, బ్రహ్మారెడ్డి, బాబ్జి, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నాగసముద్రం పంచాయతీ వీర్నకల్లు, బసిరెడ్డిపాళెంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనరు మూలి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందజేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుల, మతాలు, పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల్లో అపూర్వ ఆదరణ కనిపిస్తోందన్నారు. సచివాలయాలకు కేటాయించే నిధులతో ప్రాధాన్యతా క్రమంలో అత్యవసర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉండే తనను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, మండల కన్వీనరు కాటం రవీంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ములకా శ్రీనివాసులురెడ్డి, బొర్రా మస్తాన్‌రెడ్డి, సర్పంచ్ డేగా శ్రీనివాసులు, ఉపసర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు మూలి రాఘవరెడ్డి, అక్కెం హజరత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రసాదు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ కక్షిదారులకు మేలు

• సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్



ఆత్మకూరు: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పలు కోర్టు కేసుల్లో తీర్పులు వచ్చేందుకు ఆలస్యం అవుతుందని, ఏళ్ల తరబడి కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్‌అదాలత్ ద్వారా కక్షిదారులకు ఎంతో మేలు జరుగుతుందని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్ అన్నారు. శనివారం ఆత్మకూరు కోర్టులో ఏపీపీ సుకన్యతో కలిసి జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఆత్మకూరు డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల నుంచి అధిక సంఖ్యలో నమోదైన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి రాజేష్ మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు లోక్‌అదాలత్ నిర్వహించి వేలాది కేసులు రాజీ మార్గంలో పరిష్కరించామన్నారు. దీని వల్ల ఇరువర్గాలు నష్టపోకుండా కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో వివిధ రకాలైన మొత్తం 1190 కేసులు రాజీ మార్గంలో పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. బ్యాంకులకు సంబంధించిన కొన్ని కేసుల్లో రూ.19,35,500, వాహనాల్లో పట్టుబడిన కేసుల్లో పెనాల్టీల్లో కొన్ని కేసుల్లో రూ.3,16,900, మరికొన్ని కేసులో రూ.2,41,920 నష్టపరిహారంగా కోర్టుకు జమ చేయించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో లోక్‌అదాలత్ మెంబర్లు ఎం.వెంకటేశ్వర్లు, ఎస్‌కే అహమ్మద్‌బాషా, వివిధ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పది



ఓబుల్‌రెడ్డి, సుమిత్ర దంపతులను సత్కరిస్తున్న కదిరినాయుడుపల్లి గ్రామస్తులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి ఉన్నత పాఠశాలలో రామిరెడ్డి గంగిరెడ్డి, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రవాస భారతీయులు, ట్రస్ట్ నిర్వాహకులైన డాక్టర్ రామిరెడ్డి ఓబుల్‌రెడ్డి, డాక్టర్ సుమిత్ర దంపతులు శనివారం పాఠశాలలో సమీక్షించారు. సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కూడా పాఠశాలకు అందిస్తున్న సేవలను ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని భావించి తాము పుట్టిన గడ్డకు తమ వంతు సేవలు అందిస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయుడు రవి మాట్లాడుతూ గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు ఓబుల్‌రెడ్డి, సుమిత్ర దంపతులు, వారి కుటుంబ సభ్యులైన డాక్టర్లు అర్చన, హరిణి, కెల్విన్, క్రిష్ తదితరులతో కలిసి తమ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ సూర్యారెడ్డి, రామచంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొని ఓబుల్‌రెడ్డి, సుమిత్ర దంపతులను ఘనంగా సత్కరించారు.